# మొబైల్ కఫే

ఆఫీసుల్లో గడియారాలు అన్నీ సాయం కాలం ఐదు గంటలు యించు మించు కొంచెం తేడాతో టంగుటంగున కొడతాయి - కాని వాటి గంటల చప్పుడు కుర్రక్లార్కులు వినరు నాలుగు గంటల యాభై తొమ్మిది నిమిషాల యాభై తొమ్మిది సెకనులకే తమ తమ కుర్చీలు బర్రుబర్రున వెనక్కి నెట్టి లేచి బయటకు బిలబిలా వెళ్లిపోతూంటారు కనుక సామాన్యంగా యెవరికోగాని అవి వినపడవు.

సరిగ్గా ఆ సమయానికే సెంటర్‌లోకి 'టంచన్‌గా' వస్తుంది. సేఠ్ మారుతీ ప్రసాద్ 'మొబైల్ కఫే' - తైలసంస్కారం లేని దాని యిరుసుమీద తిరిగే పాత చక్రాల రొద కూడా మహా సందడి యినుమడించి వుండే ఆ సెంటర్‌లో వినపడదుగాని, మారుతీ ప్రసాద్ "ఫైర్‌యింజన్"లకు వుండే గంటలాంటి దొకటి యీ మొబైల్‌కఫే అనగా "నడిచే ఫలహారశాల"కి కట్టి సెంటర్‌లో పెట్టంగానే వోపెంు కొడతాడు! ఇది వినపడి తీరుతుంది!

వయసు మళ్లిపోయి - పిల్లల సంఖ్య యెక్కువైపోయి యిలాంటి "చిరుతిళ్ల"ను 'అపత్యం' గా భావించే ముసిలాళ్ళు - ముతక వాళ్ళూ తప్ప - యీ మారుతీ మొబైల్‌కఫే కాఫీ ఫలహార కేంద్రం - మీద తతిమ్మావాళ్ళు వాళ్ళేక్లాసు వుద్యోగులైనా ఎగవడతారు -

కుర్రకారు - మరీ "అపురావు" రంటూ దానిమీద పడిపోతారు! దానిక్కారణం వేరే యింకోటి కూడా వుంది.

అంత పెద్ద సెంటర్‌లో యీ నడిచే ఫలహారశాల ఒక్కటేనా వుంటుంది? మరి బోలెడున్నాయి.. ఎయిర్‌కండిషన్‌డ్ హోటేళ్ళున్నాయి - డీలక్స్ కాకా టీ దుకాణాలున్నాయి. కాని మారుతీ మొబైల్ కఫేకి వున్న డిమాండు - మరి దేనికో లేదు. అందుక్కారణం మాధురి.

గజం వెడల్పు - రెండున్నర గజాల పొడుగు - పైన టాపు... క్రింద నాలుగు చక్రాలు.. యిదీ న.ప.శాల "కాయం". కాలం మారింది... మిరపకాయ బజ్జీలకి మిరపకాయ చట్నీకి కొత్తస్టార్

వాల్యూవొచ్చింది... కాని సేఠ్‌మాత్రం నడిచే ఫలహారశాలకి కనీసం కొత్తగా వార్నిష్ కూడా కొట్టించలేదు... కాని అక్కడ 'తీర్థ ప్రజ'లాగ వుంటారు కస్టమర్స్...

"'సేఠ్" యీ మధ్య 'గోల్‌గప్పా' మాల్ పూరీ, మాత్రమేనా? అప్పటికప్పుడు వేచి వేడివేడిగా మిరపకాయ బజ్జీలు, "బ్రెడ్ మసాలా" కూడా యిస్తున్నాడు."

"ఏం చేస్తాడేం?... వూళ్ళో హోల్ మొత్తంమీద మిరపకాయబజ్జీల తర్వాతనే "మందు" కూడా చెల్లుతాంది" అంటున్నాడు సెంటర్ పహిల్వాన్ గుర్రాజు... సెంటర్‌లీడర్ మాటలకి వాల్యూవుండదా? మరి!

"'సేఠ్‌జీ! నాకో నాలుగు, నాలుగు, నాలుగు రకాల బజ్జీలూ కట్టు... పాపకి చెప్పు... దాని మీదకాస్త పెప్పర్ కూడా కొట్టమని..." అంటున్నాడు రెగ్యులర్ ఖాతాదారు రామ్‌నారాయణ... రామ్‌నారాయణ వడ్డీ వ్యాపారస్తుడు.. అందుకే అతనికి గొప్ప రెస్పెక్ట్!

'పాప' అంటే పద్దెనిమిదేళ్ల 'మాధురి!" 'మాధురి' సేఠ్‌కి సాయంచేస్తూ గల్లా పెట్టిచూసుకుంటూ వుంటుంది!

రాజారావు కీ మధ్యనే పెళ్లైంది.. పెళ్ళికి కొంచెం వో నెలముందే వుద్యోగం వచ్చింది!!

ఆ సెంటర్‌లో వున్న ఆఫీసుల్లో ఆఫీసరైనా డఫేదారైనా ఎవరైనాసరే మారుతీ నడిచే ఫలహారశాలలో టిఫిన్ తినకుండా, చాయ్ తాక్కుండా ఆ పక్క నించి నడిచి పోయాడూ అంటే వాడుత్త "ఎంబెన్న" కిందే లెక్క.

రాజారావుకి 'మాధురి'ని నేరుగా చూడాలంటే సిగ్గు... అదేమిటో యిదైపోతాడు... మాధురి అంత అందంగా వుంటుంది.

'గాడిదపిల్ల కోమలం' అంటాడు క్యాషియరు మంగపతి. కాని... దానిక్కారణం వుంది... వోసారి చత్వారం కళ్లజోడు పెట్టుకోకుండా... (అని అంటాడు మంగపతి) తాజా మిర్చీ బజ్జీలు అనుకొని, మాధురి సన్నని నున్నని నాజూకైన మృదువైన "వ్రేళ్ల" ట్టుకుని గుంజాట్ట మంగపతి.

"బద్మాష్ కహీఁకా" అందిట మాధురి. ఎర్రగా చూసి.

అది వేరే సంగతి!

అసలు సేఠ్‌మొబైల్ కఫే బిజినస్ సీక్రట్ అంతా 'మాధురి' మృదుహస్త వాసిచేతనే అంటారు కొందఱు!

ప్రొప్రయిటర్ మారుతీప్రసాద్ ఘనశ్యామ్‌లాల్ యీ "బండీ హోటలు మొదలుపెట్టినప్పుడు యింటిదగ్గరే అన్నీ చేసి స్వీటూ, హాటూ అవీ పట్టుకుని వచ్చి అమ్ముకునేటప్పుడు మంగపతికి పాతికేళ్ళు. అప్పుడూ మాధురి తండ్రి వెనుకనే వచ్చేది...

కాని మాధురిని ముక్కు తుడుచుకో అని తండ్రి పదే పదే హెచ్చరించ వలసిన వయసది.

ఇప్పుడు మాధురి గుండెల మీదున్న "దుపట్టా" జారిపోకుండా వేసుకో అని సణుక్కుంటున్నాడు సేఠ్. కాని అది జారుతూనే వుంటుంది.

మాధురి చిన్నప్పుడు - ఆకులు కత్తిరించి, కడిగి తుడిచి, ఎంగిలి కప్పులు తొలిచి తీసి అందించి లాంటి పనులు చేసేది. మంగపతికి బాగా జ్ఞాపకం.

సింహాచలానికి కూడా జ్ఞాపకం వుంది సేఠ్ పాతకథ... సింహాచలం సెంటర్‌లో కిల్లీకొట్టు పెట్టినప్పుడు "గుర్రాజు" సింహాచలానికి అసిస్టెంటు.. కాని యిప్పుడు సింహాచలానికి బాడీగార్డు గుర్రాజు...

గుర్రాజు నప్పుడు "వోరే కుర్రనాయాళా!" అంటే 'వత్తన్నా' ననేవాడు. ఇప్పుడు "గురూ" అంటారంతా వాణ్ని "ఒరే గిరే'లు ఒల్లడువాడు.

రాజారావుకీ కథంతా తెలీదు. ఎంత రష్‌గావున్నాసరే.. పాత అలవాటు మానుకో లేక - నడిచే ఫలహారశాల దగ్గర ఆగి - వో అరకప్పు చాయ్ త్రాగి కాని యింటికి పోడు.

"ఇల్లాలు కొత్త మోజులో పాపం రోజూ టిఫిన్ యేదోవొకటి చేసి వుంచుతుంది కూడాను."

రాజారావు లాంటి రెండోతరం కస్టమర్స్ వచ్చేసరికి మారుతీ మొబైల్‌కఫే స్టాటస్ పెరిగింది. గళాసులు కడగటానికి "పోలాయ్" అనే పోరగాడు (నైజాంబాలుడు) అమిరాడు. మాధురికి గల్లా పెట్టె పెత్తనం వచ్చింది.

రెండు గంటలసేపు వూపిరి సలపని బిజినెస్సు సేఠ్‌ది... "ఫస్టుపోల"కి యింటర్ వెల్స్ అయిపోయాయి అనేటంతవరకు అస్సలు యిటున్నతల అటు తిప్పకుండా వుంటుంది బిజినెస్సు.. గ్లాసులు 'కనకన' మన్నచప్పుడు. మాధురి చిల్లర యిస్తూ తీసుకుంటూ గాజులతో చేసే సవ్వడీ అదీ- అంత రద్దీవున్న సెంటర్‌లోను రాజారావు లాంటి కుర్రాళ్లు - గుర్రాజుల్లాంటి పోకిరీ యువకులు కూడా తన్మయంగా గమనిస్తూనే వుంటారు, ఆ సంగతి ఎవళ్లకీ తెలియదు అనుకుంటూనే. మాధురి వ్రేళ్లు ఎంత ధనలక్ష్మిఅయినా లోహమే కనుక, డబ్బులు అందుకుని తిరిగి తీసియిస్తూంటే ఎర్రగా కందిపోతాయి!

మాధురిది పున్నమి చందమామలాగ గుండ్రని సున్నాలాంటి మొహం. వొలిచిన దవ్వబిళ్ళలాగ వుంటాయి జెబ్బలు.షర్ట్ సెల్వార్ ధరించి మాంచి ఎర్ర రంగు దుపట్టా వేసుకుంటుంది! రెండు జెడలల్లుకుని.. అందులో ఒకదాన్ని 'యిలా' ముందుకు వేసుకుంటుంది! రెండోదేమో వెనక్కి వీపుమీదే వుంటుంది. అందుకనే అట్నుంచి చూసినా మంచి పొంకంగా కనపడుతూ వుంటుంది "మధురమ్మ" -

అట్లా అంటారు కొందరు కస్టమర్స్ ముద్దుగా...

రాజారావు తన భార్య అనుపమతో పోల్చుకున్నాడు మాధురిని అప్రయత్నంగా.. గులాబ్ జాంపండు'లా వుండే యీ పిల్లకీ సంపెంగ మొగ్గలావుండే అనుపమకీ పోలిక లేదుగాని.. అనుకుంటూనే...

అనుపమ జెడలుసన్నగా వుంటాయి వీళ్ళు గుజరాతీలో సింధీలోమరి.. యీ పిల్ల జెడలు యిట్లా వెడల్పుగా పొట్టిగా బాగుంటాయి అనుకొన్నాడు....

"మిరపకాయ బజ్జీ"లు "గోల్ గప్పా"ల కన్నా బాగుంటాయి అనుకున్నటు!

"ఏదో ఆలోచిస్తున్నావ్?" అన్నాడు శ్యామలరావ్ రాజారావ్‌ని...

మాధురిని చూడటం తన వొక్కడికే ఫండమెంటల్ రైటు అనుకుంటాడు శ్యామల రావు. మీసాలకి జుట్టు కీ రంగు వేయటం అతనికి వచ్చినంత బాగా ఎవరికీ రాదని వాళ్ళాఫీసులో టైపిస్టు జాంబవతి కాంప్లిమెంటు.

"అబ్బే! అబ్బే! యివాళ చాల్రోజులైంది... చూద్దామనీ.." అంటూ పొలక మార్చుకున్నాడు రాజారావు శ్యామలరావ్ ప్రశ్నకి జవాబు చెపుతూ..

"మాధో! బాబూజీ కోపానీ దేవ్" అన్నాడు సేఠ్!

మాధురి నీరెండలో "గులాబ్ జామ్‌పండు లా". వొద్దికగ నుంచుంటె వేరే దీపం అక్కరలేదీ దుకాణానికి" అన్నట్లు మెరిసిపోతోంది.

గల్లాపెట్టి దగ్గర ఆ పిల్ల చేతులు నిర్విరామంగా పనిచేస్తున్న టైమది.. తండ్రివైపు చూసింది. అతనిచేతులూ ఆ సమయంలో కుట్టుమిషను సూదిలా అలా పనిచేస్తోనే కష్టపడ్డాయి.

రాజారావ్ కేం? పాతాళభైరవి సిన్మాలో "ఎమ్‌టి రోమారోవు" లా గుంటాడనుకుంది - చిన్నప్పట్నుంచి తెనుగు బైస్కోపులకే అలవాటుపడ్డ మాధురి.. అందుకనే సంకోచం మాని - తనే స్వయంగా గళాసు కుండలో ముంచి నీళ్లిచ్చింది రాజారావుకి! "దీసీజ్ ఎక్స్‌ట్రాస్పెషల్ గురుడుకి" అనుకున్నారు తతిమ్మా ఎడ్యుకేటెడ్ కస్టమర్స్..

"ఏదైనా తోలుచెయ్యే కదెహె.. నువ్వీ రా! నాకు మంచినీళ్ళు కుర్రాడా!" అన్నాడు కడుపు మండిన గుర్రాజు "పొరగాణ్ని" చూసి. ఇలాంటి చిన్న విషయాలు సేఠ్‌కి పట్టవుగాని.. మాధురిని రాజారావు చూసిన చూపుయొక్క తెనుగు తాత్పర్యం అతనికి తెలియదు కాని మెరిసిపోయే మాధురి చెక్కిళ్లు వెలిగిపోయాయి! అన్న సంగతి చాలామందికి తెల్సు.

మాధురికీ మధ్య రోజు రోజుకి పెరుగుతున్న తన రొమ్ములు చూసుకోడం... మళ్లీ అంతలోనే తలఎత్తి.. తలదించి సిగ్గుపడిపోడం అసంకల్పిత చర్య! అలాంటిదే యిప్పుడూ జరిగింది.

చిరుగాలికే కందిపోయే ఆ 'జవ్వని' - దుప్పట్టా సర్దుకుని మొత్తం అంతా కందిపోయింది. రూపాయిస్తూంటే రాజారావుకి 'షాక్' కొట్టింది.. అంటే మాధురి మునివేళ్లు తగిలాయంతే!!

అంత రద్దీలో యింత సున్నితమైన సన్నివేశాలెన్నో యీ మహాకాలవాహినిలో క్షణాలు దొర్లినట్లు దొర్లిపోవచ్చునుగాని... రాజారావు మాత్రం శరీరం తేలికైపోగా.. వెనుదిరిగిపోతున్నాడు..

"బాబూజీ!...." అంది. మాధురి

"జల్తరంగిణి" లాగ...

రాజారావు ధన్యుడు అన్నట్లు జనాలు చూశారు.. రాజారావు వెనక్కి తిరిగాడు వెండి కొరడా పెట్టి కొట్టినట్లు.

"బాకీ పైసా నైలేతే క్యావ్" మంది... తతిమ్మా చిల్లర అతని చేతికందిస్తూ...

రాజారావ్ సిటీబస్ ఎక్కడం మరిచిపోయి - యింటిదాకా నడిచి వెళ్లిపోయాడు! ఆ చిల్లరందుకుని...

అట్లాంటిది.. మోబైల్ కఫేమాధురీ మారుతీ సేఠ్‌ల "యిది!"

గుర్రాజు సింహాచలంకొట్లోంచి స్పెషల్‌గా మీఠాపాన్ (అబద్ధం చిన్న పిసరు జర్దా తగిలిస్తాట్ట!) కట్టించి యిస్తాడు రోజూ మాధురికి...

"నైరే, నక్కోరే" అంటుంది... మాధురి గులాబీ పువ్వుకి ముళ్లున్నట్లు మాధురి మాట 'తెనుగు' లో అయితే యింకా కఠోరంగా వుంటుంది?.. వద్దంటూనే తింటుంది "పాన్."

సేఠ్‌కి వద్దనే దమ్ములేవు.. మాధురి పెదాలు క్లియోపాత్రాలిప్‌స్టిక్ వేసుకున్నట్టు మెరుస్తాంటాయిట... తండ్రి వెనక-ఆ ముసిలాడు బండీ తోస్తూ తిరిగిపోతూ వుంటే - దానిమీద చెయ్యయినా వేయకుండా ఆ అమ్మాయి వెళ్తూవుంటే ... ఈ పై పొయిట్రీ- సెంటర్‌లో 'రికామీ'గా తిరుగుతూ ఫ్రీలాన్స్ రైటర్‌గా విజిటింగ్ కార్డులు పంచిపెట్టే "చంద్రప్రచండ విప్లవ్‌కుమార్" చెప్పిన ఆశుకవిత్వంమది.

xxx

ఉదయించకుండా వుండడు సూర్యుడు.... వుదయిస్తే అస్తమించకుండానూ వుండడు.. మాధురిని హేమ్మాలిని అన్నా క్లియోపాత్రా అన్నా జైమాలిని అన్నా... ఏమన్నా.. అదరికీ, మిరపకాయబజ్జీ లిచ్చి మంచినీళ్లు కూడా యివ్వకుండా డబ్బులు వసూలు చేసి వాళ్ళనాన్న గల్లాపెట్టె నింపిన 'చిన్నారి' ఆ పిల్ల. అంతే, తప్ప.. ఒక్కనాడు గాకపోతే ఒక్కనాడు ఎయిర్‌కండిషన్డ్ హోటెల్లో..రైల్వే ఫ్లాట్‌ఫారమ్‌మీద, లాడ్జింగ్ హవుస్‌ల ప్రాంతాల్లో గాని - సిన్మాహాలు బాల్కనీ సీట్లో గాని; ఎవ్వరికీ కనపడలేదు. ఈ కనపడకపోడమే - ఆ అమ్మాయికి కస్టమర్స్ అంతా యిచ్చే రెస్పెక్ట్‌కి కారణం అనుకున్నాడురాజారావు!

కాని యీ మాధురి.. మారుతీమొబైల్ కఫే వోనరు సేఠ్‌చేత యీ మధ్యనే ఇంట్లో డబ్బులు దాచుకునే, చిన్నసైజు యినప్పెట్టి కొనిపించి లక్ష్మీపూజ చేయించిన మాధురి.. వో నాడు రాలేదుసెంటర్‌కి!!

వూళ్లో కొత్త సినిమాలు మూడు విడుదలైన రోజున కూడా కిటకిటలాడే మొబైల్ కఫే - అన్నీ పాతబొమ్మలే ఆడుతూవున్న ఒక లక్ష్మివారం సాయంకాలం నెలాఖరున గుమాస్తా మొహం ఎలా వుంటుందో అలా 'డల్'గా వుంది.

"గుర్రాజు" కూడా లేడు. శ్యామలరావు, రామారావు లాంటి శాల్తీ లెవరూ లేరు.

సేఠ్... అతని పోరగాడు పోలయ్యమాత్రం మొదట దేవిన "వాయి" మీద యీగలు తోలుతున్నారు పాపం!

'మాధురి' మొబైల్ కఫే వెనకాతల లేక పోడం, దాని చక్రాల్లో గాలి తీసేసినట్లువుతుందని చాలాసార్లు మంగపతి వాదించాడు కాని సేఠ్‌మాత్రం వూహించలేకపోయాడు!

వారం రోజులదాకా కస్టమర్స్ మొహమాటంగా వస్తూన్నా మిరపకాయ బజ్జీలో కారం చాల్లేదని, బ్రడ్ మసాలాలో ఉప్పు చాల్లేదని వంకలు మొదలెట్టారు.

రాజారావుకి - గులాబ్ జాంపండు అని మంగపతి రిఫర్ చేసే 'మాధురి' తనకళ్ళలో యెన్నోసార్లు కనులు కలిపి యిలా తన రొమ్ములకేసి చూసుకుని కిసుక్కున నవ్వినట్లున్న దృశ్యం జ్ఞాపకం వచ్చింది. పైగా సాయంకాలం అయ్యేసరికి అదే జ్ఞాపకం మీద జ్ఞాపకంగా వస్తున్నది!

అతనొక్కడేనా? వారం రోజుల తర్వాత మాధురిలేని మొబైల్ "కఫే" మీద మోజు తగ్గిన మగరాజులు చాలామందైనారు... వాళ్ల కుతూహలం ఎక్కువైంది..

"కుతూహలం కాదోయ్! క్యూరియాసిటీ అను.. అసలూ.. పాప పాపలా ఉన్నప్పట్నించి దాన్ని (అంటే మాధురి)నే నెరుగుదును. జిర్రున చీదిన పాపాన పోలేదనుకో" అన్నాడు. మంగపతి క్యాషియర్ కనుక ధైర్యంగా నశ్యం పీల్చి సీట్లోనే కూర్చుని 'అచ్చి'మని 'తుమ్మి' మరీను..

ఆఫీసులో "వాయిదా" తీర్మానం లాంటిది పెట్టేడు డఫేదారు ఏసుక్రీస్తు జాన్‌రాజు.. వాణ్ని అంత పేరెట్టి పిలవలేక అంతా 'రాజూ' అనే అంటారు.

"గుర్రాజుకూడా కనపడటం లేదండోయ్" అన్నాడు.

అంతే...పనులు వాయిదా వేశారు.

'సూపర్నెంటు వస్తే నాలుగు అక్షింతలేగా,పడనీ!" పడ్డాడు చెడ్డాడు కాడు అన్నాడు రిటైరైపోతున్న బుల్లిరాజుగారనే రికార్డు క్లర్క్.

"వాడు (అంటే గుర్రాజు అన్నమాట)యిచ్చిన తాంబూలమేగా దాని లిప్‌స్టిక్కూ... సో అది ఉడాయించుంటుంది వాడితోనే యికనేం" అన్నాడు మంగపతి.

రాజారావుకు మాధురి 'శీలం మీద యింత అపవాదు పడటం యిష్టం కాలేదు.

"వాడో రౌడీ వెధవ" అన్నాడు.

"అదో మహా మహా యిదా ?" అన్నాడు మంగపతి..." పైగా గజ్జెల గుర్రంలాగుంది. పెళ్లి పెటాకులు చెయ్యడు సేఠ్ ముండాకొడుకు వాడి లాభాల కోసం గల్లా పెట్టి దగ్గర పడేశాడు..." మంగపతి నస్యం పీల్చాడు మళ్లీ.

మంగపతినీ, కొంచెంసేపు క్రితం తను టీ త్రాగి వదిలేసిన ఎంగిలి గ్లాసునీ వొకేలాగ మార్చి మార్చి చూసి వూరుకున్నాడు జూనియర్ రాజారావు.

అంతలో గంటల గడియారం టంగు టంగున కొట్టిన గంటలు బహుశా మొదటి సారి వాళ్ల చెవిన పడ్డాయి...

"అమ్మో! యింకా దుకాణం కట్టలేదు" అనుకుంటూ ఆడావుడిగా సొరుగులు మూసేసి బయటపడ్డారు...

కాని సేత్ మొబైల్ కఫే "గంట" వినపడలేదు ఆ రోజు!

విపరీతమైన రద్దీ సందడి యినుమడించి వున్న ఆ సెంటర్ అంతా 'బోసి'పోయినట్టుంది - సింహాచలం కిళ్లీకొట్లో వాకబు చేశారు అందరూ... వుండబట్టక!

మంగపతి మాత్రం "గుర్రాజేడీ? సింహాచలం..." అన్నాడు - ప్రక్కనున్న నిప్పు త్రాడుకీ చుట్ట కాల్చుకుంటూ..

"అత్తారింటి కెళ్లంటాడు' అన్నాడు సోడా "కంయ్' మనిపించి సింహాచలం.

"అయితే యిది వాడిపనే" అన్నాడు మంగపతి.

తతిమ్మా వాళ్లు చర్చమర్నాటికి వాయిదా వేసి యిళ్లకు పోయారు...

×××

మర్నాడు ఉదయమే ఆ ఆఫీసులో "అర్జంట్ అవుట్" అన్న "ట్రే" లు ఖాళీగా వున్నాయి. అందరి బల్లలమీద....

మాధురి ఆ చూకీ; సేత్ కథ; వీటిమీద సభ్యులు చర్చకు పూనుకోడం ఆఫీసు పనికన్నాముఖ్యంగా భావించారు..

గోపాలానిది లౌడ్‌స్పీకర్ వాయిసు. పంచువేషన్ లేకుండా, ప్రూఫ్ రీడింగ్ అక్కర్లేకుండా మాట్లాడే శక్తి మంగపతిది... చర్చ ఝుమ్మ"ని సాగింది....

"ఇది లేచిపోయిఉంటుంది. మారుతిగాడు మొహం చెల్లక మకాం ఎత్తేస్తుంటాడు".

"కాదు దానికి టైఫాయిడ్, వాడికి మలేరియా వచ్చుంటాయి?"

"వోహో! ఈ డాక్టర్ గారు పోయి చూసొచ్చాడండీ! హిహిఁ... చక్కనిలవుజు బిళ్లలా వుంది. 'మధురమ్మ' అంటే మధురమ్మే, దానికి టైఫాయిటట్టా? అన్నాడు బుల్లిరాజు.

"అసలింతకీ రాజారావేడీ?" - మంగపతి డిటెక్టివ్ షెర్లాక్ హోమ్స్ ఫ్రెండు వాట్సన్‌లాగా మొహం పెట్టాడు.

"అవును! ఏడీ?! రాలేదు... రాజారావు రాలేదు..."

కథ మలుపు తిరిగింది.

రాజారావుకీ మాధురికీ "కనులు కనులతో కలబడితే" కలిగే "తగవు" ఏమిటో అది కొంత

కాలంగా జరుగుతూంది..."అని తీర్మానం పెట్టాడు మంగపతి.. టాపిక్ టాప్ గేర్‌లో పడ్డది...

"ఛా! మరీ అతను అట్లాంటివాడు కాడ్సార్! అది (అంటేమాధురి) కూడా అస్మంటి రకం కాదుసార్! లేపోతే మావోళ్లు ఎప్పుడో "ట్రయిలే" సేసేవాళ్లు" అన్నాడు డఫేదారు ఏ.కీ. రాజు..

"టూ + టూ యీజీక్వల్టు ఫోర్" మంగపతి తీర్పు చెప్పేవాడిలా మొహంపెట్టి చెప్పాడు... "అనగా మాధురి గుర్రాజుతో ఏ బొంబాయి కంపెనీకైనా మకాం ఎత్తేసుండాలి.. "ఆర్" అనగా "లేదా' ' మన రాజారావ్‌తో హనీమూన్‌కి రైలెక్కేసుండాలి. అసలింతకీ రాజారావ్ లీవ్‌లెటర్ వచ్చిందా? హెడ్‌క్లార్కూ?!' చనువుగా అడిగాడు మంగపతి.

"లేదయ్యా! నువ్వు పోయి కనుక్కురా.. పర్మిషన్ యిస్తాను.. వెధవది ఒక్కడు పనిచేసేదిలేదు' ' అంటూ విసుక్కున్నాడు హెడ్‌క్లార్క్...

అంతే మొహమాటంగా పనులు ప్రారంభించారంతా.

xxx

'మర్నాడు' ఆ 'మర్నాడు' యిట్లా వెళ్లాళ్లయిపోయాక క్యాలండర్ కాగితాలు చింపుతున్న డఫేదారు రాజు చెప్పాడు.

"సార్! వార్త! మెడికల్ లీవులో వున్న రాజారావుగారు రిజిగ్నేషన్ లెటర్ పంపాడు అది సూపర్నెంటుగారు యాక్సప్ట్ చేశాడు."అని.

"బయటికిపోయి చూడు రాజా! నువ్వు మోబైల్ కఫే వొచ్చిందేమో?" నన్నాడు మంగపతి డిటెక్టివ్ మొహంపెట్టి.

"యింకా ఎక్కడ మోబైల్ కఫే సార్... సేక్ మకాం ఎత్తేశాడు ఈ పూర్నంచి" అన్నాడు... ఏ.. క్రి..జ.... రాజు.

"కాని గుర్రాజు మాత్రం అత్తారింటి నుంచి వచ్చేశాడు.. రాజమండ్రి జైలు నీళ్ల వంటపట్టాయి వాయాళాకి.. దుండుముక్క లాగున్నాడు" అని కూడా అతనే చెప్పాడు.

అందరూ తలో గ్లాసు మంచినీళ్లు గడగడా తాగి "మాధురి అండ్ మారుతీ మోబైల్ కఫే కేసు ఫైల్" "జి.వో.కే (అంటే గాడ్‌వోన్లీ నోస్)గా మూసేద్దాం అన్నాడు మంగపతి" విచారంగా.

"ఒక్కక్షణం మవునం పాటిద్దాం" అన్నాడు బుల్లిరాజు నవ్వుతూ.

"నిజంగా! ఒక్క క్షణం మీరు మవునం పాటిస్తే నా యిరవై సంవత్సరాల సర్వీసు తరిస్తుంది గో ఎ హెడ్" అన్నాడు అప్పుడే వచ్చిన "సూపర్నెంట్"గారు...

xxx

బెజవాడ సాయంకాలానికి పోలికలేని ఒకానొక ఏలూరు సాయంకాలం - మెయిన్ రోడ్డు మీద - రాజారావు స్కూటర్‌మీద రంయ్‌మని పోతూ వున్నవాడల్లా "టక్కు"న బ్రేకువేసి ఆగిపోయాడు 'షాక్'

తిన్నట్లు.. రోడ్డువార చిన్నసైజు బల్లమీద "జంగిడీ"లో కూరలుపెట్టి అమ్ముకుంటున్న వ్యక్తి అతని దృష్టిని పట్టుకున్నాడు... జంగిడీలో కోసిన పుచ్చకాయ బద్దలు కూడా వున్నాయి! దాని వెనకాతల గుడ్డటోపీ ధరించి కోసిన తియ్య గుమ్మడికాయ ముక్కలాగ కూర్చున్న సేట్ మారుతి కూడా రాజారావుని పోల్చాడు.

"అరె! సాబ్! మీరా? ప్రణామ్ సాబ్" అన్నాడు.

"అరె సేట్! నువ్వా?.. యిక్కడేం చేస్తున్నావయ్యా!"

"ఏం చెయ్యను సర్కార్! పిల్లదాన్ని దేశంలోకి తీసుకుపోయి పెళ్లి చేసేసాను. ఒక్క ప్రాణం నాది. యిది చాలులే అని యిక్కడ మా బందుగులుంటే వాళ్లకి దెగ్గ యీ బేపారం పెట్టుకున్నాన్' అన్నాడు సేట్.

"నాకు కూడా! బ్యాంకులో వుద్యోగం వచ్చింది.. ఆవూరు యీవూరు తిరిగాక యిక్కడ వేశారు... అందుకని.." అంటూ రాజారావుకూడా తన సంగతి చెప్పకుని.. "పోనీ మొబైల్ కఫే పెట్టకూడదూ నీ ఎక్స్‌పీరియన్సు పనికొస్తుంది" అన్నాడు.

"ఇంకా హేమి ఎక్స్‌పీరన్సు సాబ్! సబ్ కుచ్ మాధురి బిటియాతోనే హై పోయింది" అన్నాడు "మారుతి" టోపీ తీసి బట్టతల తడుముకుని...

"సరే! వస్తా" నన్నాడు రాజారావు జాలిగా చూసి. బ్యాంకుక్లార్క్‌కదా! హుందాగా కదిలాడు.

"కూర్‌గాయల్‌కి తీసుకోసాబ్" అన్నాడు సేట్.

"ఈసారి తీస్కుంటా సేట్" అన్నాడు స్కూటర్ ఎక్కి.

కాని మరోసారి "సేట్" కొట్టు ప్రక్కనించి పోతున్నప్పుడుకూడా యింత పిసరు జ్ఞాపకం వచ్చేదికాదు రాజా రావ్‌కి తన 'ప్రామిస్' సంగతీ!!

ఇంతకీ మాధురి లేచిపోయిందా? అత్తారింటికి పోయిందా?.. అన్నది మాత్రం అప్పుడప్పుడు ఆలోచిస్తూంటాడురాజారావు తీరికవేళల్లో...

(1977 ఆంధ్రపత్రిక వారపత్రిక)